## క్లుప్తంగా

### మంగరాయునికి ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మంగరాయ ఆంజనేయస్వామి

**ఆదోనిఅర్బన్:** పట్టణ శివారులోని మంగరాయ కాలనీలో వెలిసిన శ్రీ మంగరాయ ఆంజనేయస్వామి ఆలయంలో ధనుర్మాసం సందర్భంగా మంగళవారం స్వామికి ప్రత్యేక అలంకరణలు, పూజలు జరిగాయి. ఆలయ మేనేజర్ వాసుదేవరావు ఆధ్వర్యంలో పూజారి అక్షయ్‌కుమార్, గురురాజా ఆచారి స్వామివారికి ఫల పంచామృతాభిషేకం, తేనాభిషేకం, క్షీరాభిషేకం, తులసీహారం, ప్రత్యేక వెండి అలంకారం, బెంగళూరు నుంచి వచ్చిన ప్రత్యేక పూల అలంకారం, నైవేద్యం, మహా మంగళహారతి పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

### నేడు బీజేపీ కార్యాలయ ప్రారంభోత్సవం

**ఆదోనిఅర్బన్:** పట్టణంలోని ఆర్ట్స్ కాలేజీ ప్రధాన రహదారిలో బీజేపీ నూతన కార్యాలయాన్ని బుధవారం ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ అసెంబ్లీ కన్వీనర్ శ్రీరాములు, పట్టణాధ్యక్షుడు జిందే సాయికుమార్ తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ.. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్యపాల్‌సింగ్ బాగేల్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు కునిగిరి నీలకంఠ తదితరులు హాజరవుతున్నట్లు చెప్పారు.

### ప్రారంభమైన బంగారమ్మవ్వ దేవర



గణేకల్ బంగారమ్మవ్వ

**ఆదోనిరూరల్:** మండలంలోని గణేకల్ గ్రామంలో మంగళవారం బంగారమ్మవ్వ దేవర ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం నుంచి బంగారమ్మవ్వ, దేవమ్మవ్వ, లక్ష్మమ్మవ్వ, సుంకులమ్మవ్వ దేవాలయాలకు గ్రామస్తులు చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంగళవారం అర్ధ రాత్రి పెద్దపోతును ఊరేగింపు నిర్వహిస్తారు. బుధవారం ఉదయం కుంభాలు, కలశాలతో ఊరేగింపు నిర్వహిస్తారు. దేవర మహోత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు గ్రామపెద్దలు తెలిపారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పెద్దతుంబళం ఎస్‌ఐ చిన్నపీరయ్య పోలీసు బందోబస్తు నిర్వహించారు.

### భూ సమస్యలు పరిష్కరించాలి

**ఆదోనిరూరల్:** భూ సమస్యలు పరిష్కరించాలని, సమగ్ర సర్వేలో లోపాలను సరి చేయాలని రైతు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఆదోనిలో తహసీల్దార్ వెంకటలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు రామ్‌దాసు, ఏలియాబాషా మాట్లాడుతూ రీసర్వేలో రైతుల భూములకు సంబంధించి విస్తీర్ణంలో తేడాలొస్తుండడం వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొలతలు సరి చేసి పట్టాదారు పాసు పుస్తకాలు ఇవ్వాలని, అలాగే ఆన్‌లైన్ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు.

### వలంటీర్ సేవలు భేష్


హోస్పేట్ వెళ్లి లబ్ధిదారు గాయత్రికి పింఛన్ అందజేస్తున్న వలంటీర్ బసవరాజు

**కౌతాళం:** మండల కేంద్రమైన కౌతాళంకు చెందిన వలంటీర్ బసవరాజు, కర్ణాటక రాష్ట్రం హోస్పేట్‌కు వెళ్లి పింఛన్ పంపిణీ చేసి ప్రశంసలు అందుకున్నారు. గ్రామానికి చెందిన వికలాంగురాలు గాయత్రి హోస్పేట్‌లో కాన్పు కావడంతో ఆమెకు అక్కడికే వెళ్లి పింఛన్ సొమ్ము అందించడంతో వలంటీర్‌కు గాయత్రి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థ వల్ల తాము ఎక్కడున్నా ప్రతినెలా పింఛను అందుతోందని లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు.

### నేటి నుంచి మండలస్థాయి క్రీడాపోటీలు

**కౌతాళం:** 'ఆడుదాం – ఆంధ్ర' పోటీల్లో భాగంగా బుధవారం నుంచి మండలస్థాయి క్రీడలు కౌతాళంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుబ్బరాజు తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ అధ్యక్షుడు అమరేష్ అధ్యక్షతన పోటీలను ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, కోఆప్షన్ మెంబర్, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొని క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు.

# ప్రజా సంకల్ప యాత్ర చరిత్రాత్మకం

**ఆదోనిటౌన్:** ప్రజాసంకల్ప యాత్రలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అన్నారు. వంద శాతం హామీలను నెరవేరుస్తూ ప్రజాశీస్సులు పొందడం, అభివృద్ధిలో రాష్ట్రాన్ని ప్రథమ స్థానంలో నడిపించిన ముఖ్యమంత్రి జగనన్నను మరోసారి గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వహించిన ప్రజాసంకల్ప యాత్ర ముగిసి మంగళవారంతో ఐదు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆదోనిలో సంబరాలు జరుపుకున్నారు. ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయం నుంచి గోసాసుపత్రి రోడ్డులోని దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వరకు పార్టీ కార్యకర్తలు, నాయకులతో ర్యాలీగా వెళ్లారు. మహానేత విగ్రహానికి జలాభిషేకం చేశారు. గజమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఇచ్చిన మాటను తూ.చ. తప్పకుండా అమలు చేసిన జగనన్నకు మరోసారి మద్దతునిద్దామని, సీఎంగా గెలిపించుకుందామని, రెట్టింపు పథకాలతో మరింతగా లబ్ధి పొందుదామని పేర్కొన్నారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి రావాలనే ఉద్దేశంతోనే అబద్ధాలు, కల్లిబొల్లి మాటలు, కుట్రలు, కుతంత్రాలు పన్నుతున్నారని ఆరోపించారు. టీడీపీ, జనసేన నాయకులు చెప్పే మాయమాటలు నమ్మవద్దన్నారు. చంద్రబాబు 14 యేళ్ల పాలనలో రాష్ట్ర ప్రజలకు చేసిందేమి లేదని, నిత్యం కుట్రలు, కుతంత్రాలతోనే కాలం వెల్లదీశారని విమర్శించారు. జగనన్న పాలనలో రెండున్నరేళ్లు కరోనా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసినా తర్వాత కోలుకుని రాష్ట్రాభివృద్ధికి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేశారని గుర్తుచేశారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలను ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్ వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివృద్ధి, సామాజిక సాధికారతను కల్పించిన ఏకైక ముఖ్యమంత్రి జగనన్నేనని చెప్పారు. ఏపీలో విద్య, వైద్యరంగాల్లో అనేక మార్పులు తీసుకొచ్చి పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించడం ఎంతో శుభప్రదమన్నారు. విద్య, వైద్య రంగాల్లో పొరుగు రాష్ట్రాలు జగనన్నను ఆదర్శంగా తీసుకుంటున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, మార్కెట్‌యార్డు చైర్మన్ మజర్‌అహ్మద్, పట్టణాధ్యక్షుడు దేవా, కౌన్సిలర్లు చలపతి, నాగరాజ్, రామలింగేశ్వరయాదవ్, వీరశైలింగాయతీ కార్పొరేషన్ డైరెక్టర్ మంజుల, మహిళా విభాగం జిల్లా కార్యదర్శి శ్రీలక్ష్మి, లక్ష్మి, మల్లికవ్వ తదితరులు పాల్గొన్నారు.


దివంగత ముఖ్యమంత్రి వైఎస్సార్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నాయకులు

**పెద్దకడబూరు:** నవరత్నాల పథకాలతో రాష్ట్రాన్ని సంక్షేమాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు అత్యధిక మెజార్టీతో ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంకల్ప యాత్ర ముగిసి మంగళవారంతో 5 ఏళ్లు పూర్తయ్యాయి. ఈ సందర్భంగా సర్పంచ్ రామాంజనేయులు ఆధ్వర్యంలో పార్టీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఇంటి నుంచి కార్యకర్తలతో భారీ ర్యాలీతో నినాదాలు చేస్తూ స్థానిక బస్టాండ్ ఆవరణలోని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్దకు చేరుకున్నారు. విగ్రహానికి పూలమాలలు వేసి కేక్ కట్ చేసి కార్యకర్తలతో సంబరాలు చేసుకున్నారు. దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, నాయకులు రఘురాముడు, విజయేంద్రరెడ్డి, ముక్కరన్న తదితరులు పాల్గొన్నారు.


పెద్దకడబూరులో కేక్ కట్‌చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

# వైఎస్సార్‌సీపీతోనే సమగ్రాభివృద్ధి

**ఆదోనిరూరల్:** ఆదోని పట్టణంలోని వార్డుల అభివృద్ధి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతోనే సాధ్యపడిందని వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు మనోజ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం రెండో రోజూ ఆదోని పట్టణంలోని టీచర్స్ కాలనీ, శ్రీనివాసనగర్‌లో 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం కొనసాగింది. ప్రతి గడపకు మనోజ్‌కుమార్‌రెడ్డి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా, మీ సమస్యలు ఏమిటి అవ్వా, తాత, అక్కా, అన్న, తమ్ముడు, చెల్లెమ్మ అంటూ ఆప్యాయంగా పలకరిస్తూ అడిగి తెలుసుకున్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం వంద శాతం హామీలను నెరవేర్చారన్నారు. ప్రతిపక్ష టీడీపీ నాయకులు కల్లిబొల్లి మాటలు చెబుతూ జగనన్నపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని అలాంటి వారిని నమ్మవద్దన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి శేషిరెడ్డి, నాయకులు కల్లుపోతుల సురేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయ శాంత, శేషిరెడ్డి, వినోద్‌రెడ్డి, కోటిరెడ్డి, సురేష్, సన్నీ, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న యువనేత మనోజ్‌కుమార్ రెడ్డి

# ఎన్నికల సరళిపై అవగాహన

**మంత్రాలయం:** రాబోయే సార్వత్రిక ఎన్నికల సరళిపై డీఎస్పీ సీతారామయ్య నేతృత్వంలో సమీక్ష నిర్వహించారు. మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో నియోజకవర్గంలోని సీఐలు, ఎస్‌ఐలు, పోలీస్ యంత్రాంగంతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పోలీస్ యంత్రాంగం తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పాటించాల్సిన అంశాలపై వివరించారు. రూట్ ఆఫీసర్లు, ఈవీఎం బాక్స్‌ల భద్రత కేంద్రం, ఎన్నికల బూత్‌లతో ఏర్పాటు చేయాల్సిన బందోబస్తుపై చర్చించారు. ఓటర్లకు ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలు, ముఖ్యంగా అతి సమస్యాత్మక, సమస్యాత్మక గ్రామాల్లో చేపట్టాల్సిన బందోబస్తు విధానం మెలకువలు చెప్పారు. ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పోలీస్ యంత్రాంగం ప్రధాన భూమిక పోషించాల్సిందని, ఇప్పటినుంచే ఎన్నికల భద్రత ఏర్పాట్లపై కసరత్తు మొదలుపెట్టాలని ఆదేశించారు. ఎన్నికల వేళ ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా నడుచుకోవాలన్నారు. ఎలక్షన్ కమిషన్ ఆదేశాలను తూచ తప్పకుండా పాటిస్తూ పోలీస్ యంత్రాంగానికి మంచి పేరు తీసుకురావాలని కోరారు. ఎలక్షన్ డీటీ శశిశేఖర్, సీఐలు శ్రీనివాసులు, ప్రసాద్, ఎస్‌ఐ వేణుగోపాల రాజు, ఏఎస్‌ఐలు ఆనంద రెడ్డి, నటరాజు, నాగరాజు, సూర్యనారాయణ రెడ్డి, పంచాయతీ రాజ్ ఏఈ మల్లయ్య, ఎంఈఓ నాగేశప్ప, తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎస్పీ సీతారామయ్య

# అర్హులందరికీ కేంద్ర సంక్షేమ పథకాలు

**కర్నూలు(సెంట్రల్):** దేశంలోని అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించాలన్నదే ప్రధానమంత్రి నరేంద్రమోదీ లక్ష్యమని, అందుకోసమే వికసిత్ భారత్ సంకల్ప యాత్రలు నిర్వహిస్తున్నట్లు కేంద్ర ఆరోగ్యసహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్ తెలిపారు. మంగళవారం కర్నూలు రూరల్ మండలంలోని గార్గేయపురం జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించిన వికసిత్ భారత్ సంకల్ప యాత్రకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పౌరసరఫరాలు, వ్యవసాయం, వైద్యారోగ్యం, మహిళా శిశు సంక్షేమ శాఖలతోపాటు బ్యాంకులు కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం మరో ఐదేళ్లపాటు ప్రధానమంత్రి గరీబ్ కల్యాణ్ అన్న యోజన పథకం కింద పేదలకు ఉచిత బియ్యాన్ని పంపిణీ చేస్తుందన్నారు. గ్యాస్ లేని మహిళలకు ఉచితంగా ఉజ్వల పథకం కింద గ్యాస్ కనెక్షన్ ఇస్తున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో రూ.5 లక్షల వరకు పేదలకు ఆరోగ్య భరోసా కల్పించనున్నట్లు చెప్పారు. జన ఔషధి కింద తక్కువ ధరకు మందులను అందించనున్నట్లు చెప్పారు. రైతులకు సాయిల్ హెల్త్ కార్డులు ఇచ్చి వారికి కావాల్సిన మందులను సబ్సిడీపై పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏదైనా కారణం చేత సంక్షేమపథకాలు అందకపోతే వికసిత భారత్ సంకల్ప యాత్రల్లో లబ్ధిదారులుగా నమోదు కావచ్చన్నారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులతో ముచ్చటించారు. జేసీ నారపురెడ్డి మౌర్య మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ టీజీ వెంకటేష్, జెడ్పీ సీఈఓ నాసరరెడ్డి, కర్నూలు ఆర్‌డీఓ హరిప్రసాదు, గ్రామసర్పంచ్ సోమేశ్వరమ్మ, బీజేపీ నాయకులు ప్రేమకుమార్, గోపాల్, వినూషరెడ్డి, సాయిప్రదీప్, రామస్వామి, కర్నూలు తహశీల్దార్ శివరాం పాల్గొన్నారు.


ఏర్పాటు చేసిన స్టాళ్లను పరిశీలిస్తున్న కేంద్ర సహాయ మంత్రి ఎస్పీ సింగ్ బఘేల్

# క్రీడాపోటీలు విజయవంతంగా నిర్వహించాలి

**ఆదోని సెంట్రల్:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'ఆడుదాం- ఆంధ్ర' క్రీడాపోటీలను విజయవంతంగా నిర్వహించాలని ఆదోని పురపాలక కమిషనర్ రఘునాథరెడ్డి సూచించారు. మంగళవారం సమావేశ భవనంలో వ్యాయమ ఉపాధ్యాయులు, వార్డు కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ వార్డు సచివాలయాల పరిధిలో జరిగిన పోటీలలో గెలుపొందిన జట్లకు మండల స్థాయిలో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన వారు తాలుకా స్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. బుధవారం కబడ్డీ పోటీలను నిర్వహించాలని సూచించారు. పట్టణంలోని వార్డు సచివాలయాల పరిధిలో 21 బాలుర జట్లు, 5 బాలికల జట్లు పాల్గొంటున్నట్లు తెలిపారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని సూచించారు.బుధవారం ఉదయం అక్షరశ్రీ పాఠశాలలో పురపాలక చైర్మెన్ బి.శాంత కబడ్డీ పోటీలను ప్రారంభిస్తారని తెలిపారు. పురపాలక సహాయక కమిషనర్ అనుపమ, 'ఆడుదాం- ఆంధ్ర' కో అర్డినేటర్లు, వ్యాయమ ఉపాధ్యాయులు, వార్డు కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పురపాలక కమిషనర్ రఘునాథ రెడ్డి

### మంత్రాలయంలో నారా భువనేశ్వరి పర్యటన

**మంత్రాలయం:** 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం టీడీపీ నేత చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి మంత్రాలయం నియోజకవర్గంలో పర్యటించారు. చంద్రబాబు అరెస్టుతో మృత్యువాత పడిన వ్యక్తుల కుటుంబాలను పరామర్శించారు. సాయంత్రం 4 గంటలకు పెద్దకడబూరుకు చేరుకుని గోనెపాడు గోపాల్ ఇంటికి వెళ్లారు. బాధిత కుటుంబసభ్యులతో ముచ్చటించి రూ.3 లక్షల చెక్కును భార్య జయశీలమ్మ అందజేశారు. అనంతరం రోడ్డు మార్గంలో కౌతాళం మండలం వల్లూరు గ్రామంలోని ఈరమ్మ అనే మహిళ కుటుంబ సభ్యులను కలుసుకున్నారు. భర్త ఈరన్నకు ఆర్థిక సాయం చెక్కు ఇచ్చారు. రాత్రి 7 గంటలకు మంత్రాలయం వచ్చి మృత్యువాత పడిన బెస్త రాఘమ్మ ఇంటికి చేరుకున్నారు. 10 నిమిషాలు పాటు మృతికి కారణాలు తెలుసుకున భర్త ఆంజనేయులుకు చెక్కును అందజేశారు.

### భూహక్కు పత్రాల అందజేత


రైతులకు శాశ్వత భూహక్కు పత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**కోసిగి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు –భూ రక్ష కింద మండలంలోని అగసనూరు గ్రామంలో రీసర్వే పూర్తి చేశారు. ఈ మేరకు రైతులందరికీ శాశ్వత భూహక్కు పత్రాలు మంజూరయ్యాయి. వాటిని మంగళవారం గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు ఆకాష్ రెడ్డి సమక్షంలో గ్రామ రెవెన్యూ అధికారి రాఘవేంద్ర ఆధ్వర్యంలో రైతులకు పంపిణీ చేశారు. గ్రామంలో 1123 పట్టాదారు పాసు పుస్తకాలు మంజూరుకాగా మొదటి విడుతలో 735 మంది రైతులకు మంజూరైనట్లు తెలిపారు. రీసర్వే పూర్తయిన రైతులకు భూములకు సంబంధించి హక్కు పత్రాలు అందిస్తున్నట్లు చెప్పారు. గ్రామ వైస్ సర్పంచ్ కర్రెప్ప, ఎంపీటీసీ ప్రహ్లాద, హనుమప్ప, నరసయ్య, శివయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

### కుంకనూరులో చోరీ

**దేవనకొండ:** మండలంలోని కుంకనూరు గ్రామంలో తలారి శేఖర్ ఇంట్లో చోరీ జరిగింది. వివరాలు.. తలారి శేఖర్, కుటుంబ సభ్యులు బతుకుదెరువు కోసం నెల రోజుల క్రితం వలస వెళ్లారు. తిరిగి సోమవారం కుంకనూరు గ్రామానికి చేరుకుని ఇంటికి రాగా, బీరువాలో ఉంచిన నాలుగు తులాల బంగారం, రూ.1.80 లక్షలు కనిపించడం లేదని వాపోయారు. ఘటనపై పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. ఎస్‌ఐ భూపాలుడు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

### మున్సిపల్ డ్రైవర్ల సమ్మె

**ఆదోనిరూరల్:** వేతనాలు పెంచాలని కోరుతూ మున్సిపాలిటీ డ్రైవర్ల యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద డ్రైవర్లు ధర్నా చేపట్టారు. ధర్నాను ఉద్దేశించి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఈరన్న, పట్టణ అధ్యక్ష కార్యదర్శులు తిప్పన్న మాట్లాడుతూ మున్సిపల్ డ్రైవర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించి, వేతనాలు పెంచాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.


లబ్ధిదారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి

# అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడు జగనన్న

**ఆదోనిరూరల్:** గ్రామాల అభివృద్ధికి బాటలు వేసిన నాయకుడు జగనన్న అని, ప్రతి గ్రామంలో మౌలిక వసతులను కల్పించడం జరిగిందని ఆదోని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో నాలుగో రోజూ 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపను సందర్శిస్తూ కుటుంబసభ్యులతో మాట్లాడుతూ ఎమ్మెల్యే ముందుకు కదిలారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు మొత్తం 450 గృహాలను సందర్శించి, ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, నాలుగున్నరేళ్లలో ఎలాంటి అవినీతికి తావు లేకుండా వివిధ పథకాల ద్వారా గ్రామంలోని లబ్ధిదారులకు రూ.27,33,46,000 నేరుగా వారి ఖాతాల్లో జమ చేసినట్లు వివరించారు. జగనన్న కాలనీలో పేదలకు 303 ఇళ్ల పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. గ్రామంలో రూ.70 లక్షలతో సీసీ రోడ్లు, ఎస్సీ కాలనీలో రూ.35 లక్షలు పంచాయతీ నిధులతో సీసీ రోడ్లు, రూ.15 లక్షలతో తాగునీరు పైపులైన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సచివాలయం నిధులు రూ.20 లక్షలతో ఎస్సీ కాలనీలో డ్రైనేజీ, సీసీ రోడ్లు నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ప్రజల సమస్యలన్నింటినీ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సంక్షేమ పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, సర్పంచ్ ఉచ్చప్ప, నాయకులు బసవరాజ్, లక్ష్మిశివరాజ్, మౌలా, తిక్కయ్య, కామాక్షి తిమ్మప్ప, దేవిశెట్టి మంజుల, శ్రీలక్ష్మి, దానమ్మ, పంపాపతి, హనుమంత రెడ్డి, నరసప్ప, తదితరులు పాల్గొన్నారు.

# శ్రీమఠంలో ఎమ్మెల్యే కళావతి పూజలు


శ్రీమఠం ప్రాంగణంలో ఎమ్మెల్యే కళావతి

**మంత్రాలయం:** ఆంధ్రప్రదేశ్ ఎస్టిమేట్స్ కమిటీ చైర్ పర్సన్, పాలకొండ ఎమ్మెల్యే వి.కళావతి రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై మంగళవారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా గ్రామదేవత మంచాలమ్మకు అర్చన సహిత హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రాఘవేంద్ర మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేసుకున్నారు. తహసీల్దార్ చంద్రశేఖర్, ఏఎస్‌ఐ ఆనంద్ రెడ్డి నేతృత్వంలో ఆమెకు ఆలయ మర్యాదలతో ఆహ్వానం పలికారు.


మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుంటున్న న్యాయమూర్తి ప్రతిభా దేవి

### రాఘవేంద్రుల సన్నిధిలో జిల్లా అదనపు జడ్జి

**మంత్రాలయం:** రాఘవేంద్ర స్వామి దర్శనార్థమై కర్నూలు జిల్లా అదనపు న్యాయమూర్తి ప్రతిభా దేవి మంగళవారం మంత్రాలయం విచ్చేశారు. ముందుగా గ్రామ దేవత మంచాలమ్మకు మొక్కులు తీర్చుకుని హారతులు పట్టారు. అనంతరం రాఘవేంద్రుల మూల బృందావనం చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఎస్‌ఐ వేణుగోపాల్ రాజు నేతృత్వంలో ఆమెకు స్వాగతం పలికారు.

# అర్హులందరికీ పింఛన్లు

**కోసిగి:** రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ పాలనలో పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ పింఛన్లు అందుతున్నాయని వందగల్లు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు కాల్వ లక్ష్మయ్య పేర్కొన్నారు. మంగళవారం వదంగల్లు గ్రామంలో కొత్తగా మంజూరైన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవ్వతాతలకు ఇచ్చిన మాట ప్రకారం పింఛన్ సొమ్ము రూ.3 వేలకు పెంచిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. గతంలో పింఛన్ మంజూరు కోసం జన్మభూమి కమిటీల ఆమోదం, మండల కేంద్రాలలోని అధికారుల చుట్టూ తిరుగుతూ అవస్థలు పడేవాళ్లని గుర్తుచేశారు. ఇప్పుడలాంటి పరిస్థితి లేకుండా అర్హత ఉంటే చాలు ఎవరి ప్రమేయంలో లేకుండా వలంటీర్ ద్వారా సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పింఛన్ మంజూరవుతుందన్నారు. పింఛన్ సొమ్మును వలంటీర్లు ఇంటి వద్దకే తెచ్చివ్వడంతో అవ్వతాతలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఎంపీటీసీ మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.


వదంగల్లు గ్రామంలో కొత్త పింఛన్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

# ప్రజారోగ్య పరిరక్షణకే 'సురక్ష'

**కోసిగి:** రాష్ట్ర ప్రజలకు సంపూర్ణ ఆరోగ్యం అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బెట్టన గౌడ పేర్కొన్నారు. మంగళవారం కందుకూరు సచివాలయ పరిధిలోని కందుకూరు, కామన్‌దొడ్డి, కడదొడ్డి గ్రామల ప్రజలకు డాక్టర్ అభిరూప్ ఆధ్వర్యంలో జగనన్న ఆరోగ్య సురక్ష -2 కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్య క్షేమాల కోసం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆహర్నిశలు కృషి చేస్తున్నాడన్నారు. పేదల ఆరోగ్యం దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య శ్రీ ద్వారా రూ.25 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. అనంతరం ఆ సచివాలయం పరిధిలో వివిధ వ్యాధులతో పడుతున్న వారు ఓపీ ద్వారా 315 మంది వైద్య పరీక్షలు చేయించుకున్నారు. ప్రధానంగా రక్త పరీక్ష, డయాబెటీస్, మలేరియా తదితర పరీక్షలు చేశారు. మెరుగైన వైద్యం అవసరమైన వారిని ఆరోగ్య శ్రీ ద్వారా కర్నూలుకు రెఫర్ చేశారు. అలాగే ఉచిత కంటి వైద్య పరీక్షలు చేపట్టారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేసి కంటి అద్దాలు అందించేందుకు పేర్లు నమోదు చేసుకున్నారు. డాక్టర్ రజిత, సూపర్‌వైజర్స్ శ్రీనివాసులు, ఎల్లప్ప, గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు తాయన్న, తదితరులు పాల్గొన్నారు.


వైద్య పరీక్షల కోసం క్యూలో ఉన్న ప్రజలు

# అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవానికి తరలివెళ్దాం

**పెద్దకడబూరు:** దేశంలో సామాజిక న్యాయం కోసం ఆనాడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పోరాడితే, రాష్ట్రంలో ప్రస్తుతం మన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలుచేసి చూపుతున్నారని వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ జిల్లా అధ్యక్షుడు, సర్పంచ్ రామాంజినేయులు, మాజీ ఎంపీపీ రఘురాముడు పేర్కొన్నారు. ఈనెల 19న విజయవాడలో 125 అడుగుల దేశంలోనే పెద్దదైన అంబేడ్కర్ విగ్రహం ఆవిష్కరణ, స్మృతి వనం ప్రారంభోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి మాదిరిగానే వైఎస్ జగనన్న కూడా అంబేడ్కర్ స్ఫూర్తిగా పాలన సాగిస్తున్నారన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు ప్రాధాన్యతనిస్తూ సమగ్ర, సామాజిక న్యాయ విధానంపై దృష్టి సారించారని కొనియాడారు. అంబేడ్కర్ స్మృతి వనం ప్రారంభోత్సవానికి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు అధిక సంఖ్యలో తరలివెళ్లి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోస్టర్లను విడుదల చేశారు. ఉరుకుంద ఈరన్నస్వామి ట్రస్ట్‌బోర్డు సభ్యుడు విజయేంద్రరెడ్డి, దొడ్డిమేకల సర్పంచ్ చంద్రశేఖర్, కోసిగి మార్కెట్‌యార్డ్ వైస్‌చైర్మన్ ముక్కరన్న, నాయకులు గజేంద్రరెడ్డి, పూజారి ఈరన్న, అర్లప్ప, బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.


పెద్దకడబూరులో పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

# అక్రమ మద్యంపై సెబ్ దాడులు

**ఆదోనిరూరల్:** ఆదోని పట్టణంలో లక్ష్మినారాయణ అనే వ్యక్తి 48 కర్ణాటక మద్యం ప్యాకెట్లు కలిగి ఉండగా గుర్తించి, అరెస్టు చేసినట్లు సెబ్ సీఐ హరికృష్ణ మంగళవారం విలేకరులకు తెలిపారు. అలాగే ఇందిరా నగర్‌లో దాడులు నిర్వహించగా ఎం.లక్ష్మి అనే మహిళ ఒక బిందెలో 15 లీటర్ల నాటుసారా కలిగి ఉండగా గుర్తించి అరెస్టు చేసినట్లు చెప్పారు. వారిపై కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా ఇందిరానగర్‌లో ఎల్లమ్మ, దుర్గాప్రసాద్ అనే ఇద్దరిని బైండోవర్ చేసినట్లు తెలిపారు. ఎవరైనా అక్రమంగా మద్యం అమ్మినా, సరఫరా చేసినా కేసులు నమోదు చేసి జైలుకు పంపుతామని హెచ్చరించారు. సెబ్ ఎస్‌ఐ శివప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


వివరాలు వెల్లడిస్తున్న సెబ్ సీఐ హరికృష్ణ